# సత్య ప్రకటన

**రచన**

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని

మసీహె మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం



:ముద్రణ:

నజారత్ నష్రో ఇషాఅత్

సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

# సత్య ప్రకటన

అమృత్సర్ నివాసులైన అబ్దుల్లాహ్ ఆథమ్ మసీహీ గారు ఓటమికి గురైనచో ఇస్లాం స్వీకరిస్తానని చేసిన అంగీకార పత్రము ఇందులో గలదు. నన్ను ధృవీకరిస్తు కొందరు అరబ్, సిరియా ప్రముఖ విద్యావంతులు నాకు వ్రాసిన ఉత్తరములు ఇందులో గలవు.


:రచన:

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని

మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం

:అనువాదము:

హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్



:ముద్రణ:

నజారత్ నష్రో ఇషాఅత్

సదర్ అన్జుమన్ అహ్మదియ్య ఖాదియాన్

سچائی کا اظہار

Sachchā’ī Kā Izhār
Urdu
By
Hazrat Mirza Ghulam Ahmad
the Promised Messiah and Mahdi alaihissalam

Telugu Translation
Satya Prakatana
By
Hafiz Syed Rasool Niyaz

First Edition : 2021
Copies : 500
Printed at : Fazl-e-Umar Printing Press Qadian
Published by: Nazarat Nashr-o-Isha'at,
Sadr Anjuman Ahmadiyya Qadian
Dist: Gurdaspur, Punjab, India,143516

ఇతర వివరాలకు సంప్రదించగలరు

www.alislam.org
www.ahmadiyyamuslimjamaat.in
Toll Free No: 1800-103-2131

# తొలి పలుకులు

ఈ ప్రపంచమెంత విచిత్రమో అంతే విశాలమైనది. రాళ్ళు రప్పలకు అసలు ప్రాణమే లేదు. చెట్లు, చేమలకు ప్రాణముంది గాని జ్ఞానం లేదు. పశుపక్ష్యాదులకు ప్రాణము, జ్ఞానమూ రెండూ వున్నాయి. కాని ఆ జ్ఞానం వాసనా జ్ఞానమే. వివేక జ్ఞానం కాదు. వివేక జ్ఞానమున్నది మానవుడొక్కడే. పూర్ణత్వము మానవుడొక్కడిలోనే వుంది. ఎందుకనగా అల్లాహ్ తఆలా మానవుణ్ని తన గుణగణాల సారాంశముగా పుట్టించెను. అల్లాహ్ తఆలా ఈ ప్రపంచమును సృష్టించిన తర్వాత తన ఆరాధన నిమిత్తం మానవుణికి ప్రాణము పోసెను. ఇది మానవ జన్మ ఔన్నత్యమును తెలియజేస్తుంది. వాస్తవానికి ఈ లోకములోని సూర్యుడు, చంద్రుడు, భూమి, ఆకాశము, నీరు, గాలిని అనగా ప్రతి వస్తువును అల్లాహ్ తఆలా మానవుని సేవ కొరకు పుట్టించెను.

మానవుణ్ణి పుట్టించిన తర్వాత అతని జీవిత మనుగడ కొరకు వివిధ బాహ్య వస్తువులను అతనికి అందుబాటులో వుంచినట్లే అతని ఆధ్యాత్మిక అవసరాల నిమిత్తం కూడ తన సందేశహరులను పంపి, తన శాసనమును ఆది నుండి పంపుతున్నాడు. కాని మానవుడు తన అవివేకము లేదా ప్రాపంచిక ఐశ్వర్యములో మునిగి తేలుతు దేవుడు పంపిన అవతార పురుషుల ఉపదేశములను పాటించక వారికి వ్యతిరేకంగా పోరాడి వారిని బాధ పెట్టడం పరిపాటి. ఇదే విషయాన్ని పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ తఆలా ఈ విధంగా స్పష్టము చేసెను.

يٰحَسْرَةً عَلَى الْعِبَادِ ۚ مَا يَأْتِيهِمْ مِّنْ رَّسُولٍ إِلَّا كَانُوا بِهِ يَسْتَهْزِءُونَ

(యాసీన్-36:31) అనగా వారి వద్దకు ఏ ప్రవక్త ఎప్పుడు

వచ్చినను వారు అతనిని నీచముగా చూచుచు (పరిహసించుచుందురు) (నిరాకరించు) దాసులపై విచరాము.

ఇదే ఆచారము ప్రకారము ప్రపంచములో అవతరించిన ప్రవక్తలందరిని దుష్టులు వ్యతిరేకించారు. తుదకు దయాసాగరులైన మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కూడ ఆ కాలపు దుష్టులు ఇదే తరహాలో వ్యవహరించారు. కావున ఈ కాలపు ఇమామ్ హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదయినీ మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం సైతం ఇటువంటి వ్యతిరేకతను ఎదుర్కోవడం జరిగింది. ఈ పుస్తకములో ముస్లిములు సైతం ఏ విధంగా వారి (అ)ను దుఃఖమునకు గురి చేశారో, వారి ఆశయాలను అడ్డుకోవడం కొరకు ఎలా కృషి చేశారో తెలియపరుస్తు అల్లాహ్ తఆలా సత్యస్వభావికులను ఎలా ఈ కాలపు ఇమామ్‌ను స్వీకరించారో వారు వివరించారు.

హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఆమోదముతో ఈ పుస్తకమును తెలుగు భాషలో ప్రచురిస్తున్నాము. గౌ॥ హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్ ఇంచార్జి తెలుగు డెస్క్ దీనిని తెలుగులో అనువదించగా గౌ॥ ముహమ్మద్ లతీఫ్ షరీఫ్ కొండూరు, గౌ॥ ఎ.కె.ముబారక ఖాదియాన్ గారలు ప్రూఫ్ రీడింగ్ చేశారు. అల్లాహ్ తఆలా వీరందరికి చక్కటి ప్రతిఫలము నొసంగుగాక! ఈ పుస్తకము పాఠఖ మహాశయులందరికి ఆధ్యాత్మికంగా ప్రయోజనము కలిగించుగాక!

*హాఫిజ్ మఖ్దూమ్ షరీఫ్*
*నాజిర్ నష్రో ఇషాఅత్ ఖాదియాన్*

# హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని అలైహిస్సలాం

## (రచయిత పరిచయం)

హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని మసీహ్ మౌవూద్, మహ్దీ మాహూద్ అలైహిస్సలాం 1835 ఫిబ్రవరి 13వ తేదీన భారత దేశములోని ఒక చిన్న పట్టణము ఖాదియాన్‌లో జన్మించారు. బాల్యము నుండే వారు దైవారాధన, దుఆలు (ప్రార్థనలు), పవిత్ర ఖుర్‌ఆన్‌తో పాటు ఇతర గ్రంథముల పఠనములో నిమగ్నమై వుండేవారు. అప్పుడు నలు వైపుల నుండి ఇస్లాంపై దాడులు జరుగుతున్నందున దాని దయనీయ స్థితిని చూసి తీవ్ర కలతకు గురయ్యేవారు. ఇస్లాం రక్షణతో పాటు దాని బోధనలను స్వచ్ఛమైన రీతిలో ప్రపంచములో వ్యాపింపజేయుటకు వారు (అ) సుమారు 90 కంటే అధిక పుస్తకములను రచించారు. వేల సంఖ్య ఉత్తరములు వ్రాశారు. అనేక ధార్మిక సంభాషణలు, చర్చలు జరిపారు. మానవులకు సృష్టికర్తతో సంబంధమేర్పరచ గల ధర్మము ఇస్లామ్ మాత్రమే అని, ఇస్లాంను అనుసరించి మానవుడు ప్రవర్తనల పరంగా, ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేరవచ్చునని వారు తెలిపారు.

చిన్నతనము నుండే వారు సత్య, దివ్య స్వప్నములతో పాటు

దైవ సంభాషణలతో సత్కరించబడిరి. 1889 మార్చి 23వ తేదీన అల్లాహ్ తఆలా అభీష్టము మేరకు బైఅత్ ప్రతిజ్ఞ పరంపరను ప్రారంభించి ఒక పవిత్ర సంస్థకు పునాది వేశారు. దైవ సంభాషణలలో క్రమంగా ప్రగతి సంభవించెను. కావున ప్రపంచమంతటా వివిధ నామములతో గుర్తింపు పొందిన ప్రపంచ సంస్కర్త వాగ్దత్త తానేనని అల్లాహ్ తఆలా ఆదేశముతో ప్రకటించుకొనిరి. హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణి ప్రకారము అవతరించవలసిన మసీహ్, మహ్దీ తానేనని కూడ వారు ప్రకటించారు. ఇప్పుడు అహ్మదియ్య సంస్థ ప్రపంచ పటములోని 214 కంటే ఎక్కువ దేశములలో స్థిరంగా ఏర్పడినది.

1908వ సంవత్సరములో వారు పరమపదించిన తర్వాత పవిత్ర ఖుర్ఆన్, ఇస్లాం స్థాపకులైన హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం భవిష్యవాణీల ప్రకారము వారి (అ) అవతరణ లక్ష్యమును పూర్తి చేయుటకు ఖిలాఫత్ (ఉత్తరాధికాధిత్వ) వ్యవస్థ ప్రారంభమయ్యేను. ప్రస్తుతం వారి (అ) ఐదవ ఖలీఫాగా, అహ్మదియ్య జమాఅత్ (సంస్థ) వర్తమాన ఇమామ్ (అంతర్జాతీయ అధినేత)గా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ప్రస్తుతం లండన్ కేంద్రముగా విధులు నిర్వహిస్తున్నారు.

# పుస్తక పరిచయం

(హజ్రత్ మౌలానా జలాలుద్దీన్ షంస్)

1893 మే నెలలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం సత్య ప్రకటన అను నామముతో ఈ పుస్తకమును ప్రచురించారు. నేను ఓటమికి గురైనచో ఇస్లాం స్వీకరిస్తానని అమృత్సర్ నాయకులైన పాద్రి డిప్యూటి అబ్దుల్లాహ్ ఆథమ్ వ్రాసిచ్చిన అంగీకార పత్రమును ఈ పుస్తకములో హుజూర్ అలైహిస్సలాం పొందుపరచినారు. డాక్టర్ క్లార్క్ 1893 మే 12వ తేదీన "**నూర్ అఫ్షాం**" అనుబంధ పత్రికలో ముద్రించిన కరపత్రమును కూడ హుజూర్ (అ) ఇందులో ప్రస్తావించారు. డాక్టర్ క్లార్క్ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో సంభాషణ నుండి తప్పుకోవాలని తన కరపత్రములో జండియాలా ముస్లిముల నుద్దేశించి ఇట్లు వ్రాసెను. మీరు ఏ వ్యక్తిని తమ నాయకునిగా నియమించుకున్నారో అతనిని ముస్లిం ఉలమాలు అవిశ్వాసి, ఇస్లాం నుండి బహిష్కృతులని, అతని అంత్యక్రియ ప్రార్థన చదవడం కూడ సమంజసం కాదని నిర్ణయించారు. ఇషాఅతుస్సున్నహ్ పత్రిక సూచనను వారు వ్రాశారు. కాని జండియాలా ముస్లిముల తరపున మియాం ముహమ్మద్ బఖ్ష్ గారు వారికిట్లు సమాధానము పంపించిరి. ఇస్లాంకు సహకరిస్తున్న ముస్లింను అవిశ్వాసి అని ప్రకటిస్తున్న మౌల్వీలను మేము శాంతి విఘాతులుగా భావిస్తాము. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ ఈ పుస్తకములో ఇట్లు తెలియజేశారు.

"అల్లాహ్ తఆలా జ్ఞానము, కర్మల శక్తి, విశ్వాస, వివేక కాంతి ప్రసాదించిన మంచి ముస్లిం నిపుణులైన విద్యావంతులు నాతో వున్నారు. అటువంటి వ్యక్తులు ఇప్పుడు సుమారు 40 మంది వున్నారు. వ్యతిరేక పక్షము వైపున వున్న అధికులు కేవలం నామమాత్ర మౌల్వీలే, ఆచరణపరంగా శూన్యులు వున్నారు."

*(సత్య ప్రకటన పుట:5)*

ఈ విషయమును నిరూపించుటకు హుజూర్ (అ) ప్రకటనను ధృవీకరినంచిన పవిత్ర నగరములైన మక్కా, మదీనాలోని ముగ్గురు విద్వాంసుల ఉత్తరములను ఈ పుస్తకములో ముద్రించారు. ఇంకా ముబాహిలహ్ కొరకు స్వయంగా మనవి చేస్తూ అబ్దుల్ హఖ్ ఘజ్నవీ ప్రచురించిన కరపత్రమును ఈ పుస్తకములో ప్రస్తావించి ఇతర ఉలమాలను కూడ ఈ ముబాహిలహ్‌లో పాల్గొనాలని ఆహ్వానించారు.

☆ ☆ ☆

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ

# బటాలా నివాసులైన షేఖ్ ముహమ్మద్ హుసేన్ గారి పత్రిక ఇషాఅతుస్సున్నహ్ ద్వారా కొన్ని ధార్మిక విషయములలో పాద్రీ గారలకు లభించిన ప్రత్యేక సహాయము గూర్చి ప్రస్తావన

అమెరికన్ మిషన్ ప్రెస్ లుధ్యానాలో డా॥ హెన్రీ మార్టిన్ క్లార్క్ ఎమ్.డి. మెడికల్ మిష్నరీ అమృత్సర్ ద్వారా ఒక కరపత్రము నాకు పోటీగా 12 మే 1893వ తేదీన ముద్రించబడినది. అందులో ఒక రకంగా బటాలా వాస్తవ్యులైన ప్రముఖ మౌల్వీ షేఖ్ ముహమ్మద్ హుసేన్ గారికి కృతజ్ఞతలు తెలుపబడినవి. వాస్తవనాకి క్రైస్తవుల కొరకు ఇది సంతోషించదగ్గ విషయమే. ఎందుకనగా డాక్టర్ గారు నాకు పోటీగా ఇస్లాం మరియు క్రైస్తవ మతమును పరిశోధించుటకు, గ్రహించుటకు, సత్యము, అసత్యమును పరీక్షించుటకు చర్చకు ఒప్పుకున్నారు. కాని అనంతరం బాగా ఆలోచించగా వారికి ఆందోళనకర పరిస్థితి ఎదురైనది. మానవుణ్ణి దేవునిగా చేయు సందర్భమున శరీరము లోపలి నుండి కంపించుట సత్యమే. ఎందుకనగా మానవుడు ఎన్నడు దేవునిగా మారలేడు. సర్వశక్తిమంతుడైన పవిత్రుడైన దేవునికి పోటీగా మట్టి అయిన మానవుడు ఏమి చేయగలడు. సత్పథమైన ఇస్లాంకు పోటీగా నిలబడినప్పుడు క్రైస్తవ ప్రణాళిక రహస్యము బట్టబయలవుతుందని

పాద్రి గార్లు భయపడిపోయిరి. కావున ఏదో రకంగా ఈ చర్చ రద్దు చేయబడినచో బాగుండునని, ఈ ఆపద ఏదో ఒక విధంగా తప్పిపోతే మంచిదని వారు ప్రయత్నించిరి. ఈ బాధాతప్త సమయములోనే షేఖ్ గారిచే వారికి చాలా సహాయము లభించినది. షేఖ్ గారు స్వయంగా సహకరించు ఉద్దేశముతో రహస్యముగా పాద్రీల గారి వద్దకు చేరుకున్నారని గట్టి భావము కలుగుతుంది. ఎందుకనగా డాక్టర్ గారు నాకు వ్రాసిన ఉత్తరములో ఇషాఅతుస్సున్నహ్ పత్రికలోని పలు వ్యాసముల అంశములను ప్రస్తావించారు. అవి షేఖ్ గారి వ్యాసములను పోలి వున్నవి. ప్రమాణము చేసి చెప్పాలని షేఖ్ గారికి చెప్పినచో వారు బహుశః నిరకారించ లేరు. నూర్ అఫ్షాం అనుబంధపు సంచిక 12 మే 1893వ తేదీన ముద్రించిన పత్రిక ఇప్పుడు మా చేతిలో వున్నది. దానిని చూచినచో అది స్పష్టంగా ఇదే సాక్ష్యము ఇస్తున్నది. అందులోని పంక్తి ఇట్లు గలదు. మీరు (ఓ జండియాలా గ్రామ నివాసులారా!) ముహమ్మదీయ వ్యక్తునిగా (ముస్లింగా) భావించబడని వ్యక్తిని (అనగా నన్ను) చర్చ కొరకు ప్రవేశపెడు తున్నారు. మీరెలాంటి ఆలోచనలలో వున్నారు. మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ గారి గురించి పంజాబ్, భారత దేశములోని పండితులు ముద్రించిన తీర్మానాలను మీరు గమనించలేదా? ప్రస్తావించబడిన తీర్మానాలలో వారిట్లు వ్రాసిరి. ప్రశ్నించిన వ్యక్తి ప్రశ్నకు సమాధానంగా ఖాదియానీ వ్యక్తి గురించి మేము వెల్లడించినది సత్యమే. గ్రంధము, సున్నత్, ఈ సమాజపు పండితుల వ్యాఖ్యానములు అది నిజమే అని సాక్ష్యమిస్తున్నవి. కావున ఇటువంటి బూటకపు దజ్జాల్ నుండి ముస్లిములందరు దూరముండ వలెను. ముస్లిములు పరస్పరం సంప్రదించుకొను విషయములను

అతనితో నెరపకూడదు. అతనికి మొదట సలాం చేయకూడదు, సున్నత్ ప్రకారమే చేయబడు విందులలో అతనిని ఆహ్వానించ కూడదు, అతని వద్ద కూర్చొనకూడదు, అతని విధేయతలో నమాజ్ చదవకూడదు, అతని అంత్యక్రియ ప్రార్థన చదవకూడదు. వీరు ధార్మిక విషయములలో దొంగలు. వ్యాధిని పెంచుతారు. మోసకారి, అసత్యుడు, శాపగ్రస్తుడు, నాస్తికుడు, ఇస్లాం పరిధిని దాటిన అవిశ్వాసుడు, అత్యంత అవిశ్వాసుడు, అధర్ముడు, ఇబ్లీస్‌చే మార్గభ్రష్టుడైన వ్యక్తి, ఇతరులను తప్పుదారి పట్టించు వ్యక్తి, సున్నత్, జమాఅత్ నుండి వెలువడిన వ్యక్తి, మహా మోసగాడు, దజ్జాల్ పెదనాన్న, ధర్మము పేరి ఆదాయము పొందు వ్యక్తి. వివరంగా చూడదలచిన ప్రజలు మౌల్వీ అబూసయీద్ ముహమ్మద్ హుసేన్ గారి పత్రిక ఇషాఅతుస్సున్నహ్‌ను తెప్పించుకొని చూడవచ్చును. ఎనిమది (8) అణాలకు ఇది లాహోర్‌లో లభ్యమగును. ఇప్పటి వరకు ఈ పుస్తకమును చూడని మీరు ఎంతో విచిత్రమైన నిర్లక్ష్యములో పడి వున్నారు. మీపై, జండియాలా గ్రామ ముస్లిముల ధైర్యముపై ఎంతో విచారము. ఎవరి అంత్యక్రియ ప్రార్థన ధర్మబద్ధము కాదో అతనినే మీరు నాయకునిగా నిర్ణయించుకున్నారు. మీ ఈ అర్థరహిత ఆలోచనపై విచారము! విచారము!!

బటాలా నివాసులైన వ్యక్తి, అతని పత్రిక ఇషాఅతుస్సున్నహ్ నుండి పాద్రీ గారలు ఎంతటి లబ్ధి పొందారో, మన గౌ॥ ముస్లిములే వ్యతిరేకులకు ఎంతటి అవకాశములు కల్పించారో మంచిగా గ్రహించండి. ఇషాఅతుస్సున్నహ్ సూచనలతో వ్రాసిన ఈ మోసపూరిత ఉత్తరమును చూచిన తర్వాత కూడ గట్టి విశ్వాసులైన జండియాలా గ్రామస్తులు కొంతైనా వెనుకడుగు వేయకపోవుట హర్షించదగ్గ విషయము. జండియాలా నుండి మియాఁ ముహమ్మద్

బఖ్ష్ (గారు) ఎంతో గట్టి సమాధానము పాద్రీ గారలకు ఇచ్చారు. అంతర్గత విభేదాలు లేని ఏ మతము లేదు. క్రైస్తవ మతము సైతం ఈ కోవకు చెందినదే. ఇస్లాంనకు సహకరిస్తున్న ముస్లింను అవిశ్వాసుడని ప్రకటించే మౌల్వీలను మేము వాస్తవానికి అశాంతి కారకులని భావిస్తాము.

## బహిరంగ సమాచారము

నా సత్యమును నిదర్శనములతో సహా నిరూపించుటకు అరబి భాషలో నేను రచించిన పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణ, పద్యము నకు పోటీగా వ్రాయాలని పంపబడిన ఉత్తరమునకు సమాధానంగా ఫలానా ఫలానా తేదీ వరకు వ్రాసి తప్పక పంపిస్తానని, ఈ సారి వాగ్దాన భంగము జరగదని ఇషాఅతుస్సున్నహ్ పత్రిక సంపాదకులు షేఖ్ బటాల్వీ గారు రెండు సార్లు గట్టి ప్రతిజ్ఞ చేశారు. ప్రస్తుతం ఆ రెండు తేదీలు దాటి 16 రోజులు గడిచినవి. షేఖ్ గారు పదే పదే వాగ్దానము చేసి వెనుకడుగు వేయడం వలన వారేదో ఆపదలో చిక్కుకొని వున్నారని స్పష్టంగా సూచిస్తుంది. ఈ చర్చలో మసీహ్ మరణము, జీవితము గురించి చర్చ జరిగినచో మేము తప్పక డాక్టర్ క్లార్క్ గారి ప్రతినిధులుగా ఈ చర్చలో పాల్గొనేవారమని కొందరు మౌల్వీలు అంటున్నారని మూడు రోజుల క్రితం అమృత్సర్ నుండి సూచనప్రాయంగా నాకొక సందేశము అందినది. కావున ఈ కోరికను కూడ తీర్చుకోవచ్చునని ఈ సందర్భమున షేఖ్ గారికి, వారి సహచరులకు ప్రమాణపూర్వకంగా బహిరంగ సమాచారము పంపుతున్నాము. మసీహ్ జీవితము, మరణము గురించి కూడ డాక్టర్ క్లార్క్ గారితో తప్పక చర్చ జరుగును.

నిస్సందేహంగా మీరు వారికి సహకరించవచ్చును. కాని అల్లాహ్ తఆలా అసత్యులను అవమానానికి గురి చేయునని తెలుసుకోండి. సర్వ ప్రశంసలకు సకల లోకాల అల్లాహ్‌యే అర్హుడని చివరి మాటగా మేము ప్రకటిస్తున్నాము.

## డా॥ మార్టిన్ క్లార్క్ గారి ఒక అపోహ నివారణ

నూర్ అఫ్‌షాం పత్రిక లుధ్యానా అనుబంధ సంచికగా ప్రచురితమైన 1893 మే 12వ తేదీ నాటి తమ కరపత్రములో డా॥ గారు షేఖ్ బటాల్వీ గారి పత్రిక ఇషాఅతుస్సున్నహ్‌తో ఒక రకంగా మోసపోయారు. అనగా ఇస్లాంలోని పక్కా పండితులు నన్ను అవిశ్వాసుడని నిర్ణయించారు. కావున సాధారణ ప్రజలకు ప్రముఖ వ్యక్తులకు ఈ సమాచారము అందిస్తున్నాము. అల్లాహ్ తఆలా జ్ఞానము, కర్మల శక్తి, విశ్వాస, వివేక కాంతి ప్రసాదించిన మంచి ముస్లిం నిష్ణాతులైన విద్యావంతులు నాతో వున్నారు. అటువంటి వ్యక్తులు ఇప్పుడు సుమారు 40 మంది వున్నారు. వ్యతిరేక పక్షము వైపున వున్న అధికులు కేవలం నామమాత్ర మౌల్వీలే, ఆచరణపరంగా శూన్యులు వున్నారు. నా ఈ వ్యాఖ్యానము డా॥ గారి దృష్టిలో అతిశయోక్తి కానిచో మా వ్యతిరేక వర్గ పండితులు, నా పక్షములో వున్నటువంటి ప్రముఖ పండితులు పాల్గొన్న ఏదో ఒక సమావేశములో స్వయంగా డా॥ గారు వచ్చి చూడగలరు. త్వరలోనే ఇటువంటి ఒక సమావేశము చర్చావేదిక రూపంలో 15 జూన్ 1893వ తేదీన నిర్వహించబడును. ఇందులో మా వ్యతిరేక వర్గ మౌల్వీ గులాం దస్తగీర్, వారితో ఏకీభవించిన లాహెూర్ మౌల్వీలు పాల్గొంటారు. మా వైపున కూడ ఒకరిద్దరు

పోటీకి ప్రముఖ విద్యావంతులు పాల్గొంటారు. కనుక దైవామోదిత పండితులు, ప్రముఖ విద్యావంతులు ఎటువైపు వున్నారో, నామమాత్రపు మౌల్వీలు, నోటి దురుసుతో మాట్లాడే వారు ఎటు వైపు వున్నారో పాద్రి గారు స్వయంగా పాల్గొని ప్రత్యక్షంగా చూడవచ్చును. విన్న విషయము చూచిన విధంగా వుండదనే సామెత అందరికి తెలిసినదే. ఒక లోభి అయిన శత్రువు కలముతో వెలువడిన రచనలు ఎన్నడు ఒక వివేకవంతుని దృష్టిలో గౌరవ, మర్యాదలు పొందలేవు. ఎందుకనగా పరీక్షించినచో ప్రతి ఒక్క వాస్తవము స్పష్టమైపోవును.

ముస్లిముల గుర్తింపు పొందిన పండితుల కేంద్రము రెండు పవిత్ర నగరములు (మక్కాలో వున్న మస్జిద్ హరాం, మదీనాలో వున్న మస్జిద్ నబ్వీ) అని కూడ డాక్టర్ గారికి బాగా తెలుసు. అల్లాహ్ తఆలా ఆ రెండు పుణ్యక్షేత్రముల ప్రతిష్ట, సత్కారము, శుభమును పెంచుగాక! అరబ్ దేశములో వున్నటువంటి ఈ రెండు నగరములు అనగా ప్రత్యేకంగా మక్కా, మదీనాలు ధర్మమునకు కేంద్రములని ఇస్లాం భావించబడును. ఆ పవిత్ర పుణ్య క్షేత్రముల గొప్ప పండితులు సైతం నా పక్షమున చేరుతున్నారు. ఉదాహరణగా ముగ్గురు ప్రముఖుల ఉత్తరములను ఇచట పొందుపరుస్తున్నాను.

(నా రచన ఆయీనా కమాలాతె ఇస్లాం. తబ్లీఘ్‌లోని అద్భుత సాహిత్యము గురించి అరబ్ దేశస్తులైన ఒక గొప్ప పండితుని సాక్ష్యము. వీరు మహా నగరములో సాహిత్య బోధన మొదలగు విభాగములో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు.)

నా సోదరులు గౌ॥ మౌల్వీ హాఫిజ్ ముహమ్మద్ యాఖూబ్ సల్లమహు దెహ్రాదూన్ నుండి ఇట్లు వ్రాస్తున్నారు. మీరు ఈ కాలపు ఇమామ్, దైవ సహాయము పొందిన వారని నేను

విశ్వసిస్తున్నాను. ధార్మిక విద్వాంసులను అల్లాహ్ తఆలా మీకు వేటగా లేదా బానిసలుగా చేశాడు. మీ విరోధి ఎన్నడు సఫలము కాలేడు. అల్లాహ్ తఆలా నన్ను మీ సేవకులలో చేర్చి, అదే స్థితిలో మరణమిచ్చుగాక! ఓ అల్లాహ్ ఇలాగే అనుగ్రహించుము. ఒక అరబ్ విద్యావంతులు ఇప్పుడు నా వద్ద కూర్చొని వున్నారు. సిరియా దేశస్తులు. సయ్యిద్ వంశస్తులు. గొప్ప సాహిత్యకారులు. అరబ్ భాషలోని వేలాది పద్యములు వీరికి (నోటికి) గుర్తున్నవి. మీ గురించి వీరితో సంభాషణ జరిగినది. వారు గొప్ప విద్యావంతులు, నేను అంతగా చదువుకోలేదు. కాని తవఫ్ఫీ అనే పదము గురించి ఏమి తెల్చుకోలేక పోయాము. ఆయినా కమాలాతె ఇస్లాంలోని అరబి భాగము వారికి చూపించనైనది. అల్లాహ్ ప్రమాణముగా! భారతీయుని మాట అటుంచితే ఇటువంటి రచన అరబ్ దేశస్తుడే చేయలేడు. ఖసీదహ్ పద్యము చూపించగా చదివి రోధించారు. అనంతరం ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణముగా! భారతీయులను పక్కన బెట్టగా నేను ఈ కాలపు అరబ్ పద్యములను సైతం ఎన్నడు ఇష్టపడలేదు. నేను ఈ పద్యములను కంఠస్తం చేయుదును. ఇంకా ఇట్లనిరి. అల్లాహ్ ప్రమాణముగా! ఇతని కంటే గొప్పగా వ్రాయగలనని ప్రకటన చేసిన వ్యక్తి అరబ్బుడైనను అతడు శాపగ్రస్తుడైన ముసైలమా కజ్జాబ్ అగును. ఇంకా వారిట్లనిరి. ఈ రచన దైవ వాక్యము, దైవ సహాయముతో వ్రాయబడినది, ఇది మానవుని పని కాదని నేను విశ్వసిస్తున్నాను. నేను ఈ రచయితను నా ప్రాణము, నా కుటుంబము, ఆస్తి పాస్తులకు యజమానిగా చేసుకున్నాను.

# నా పేరున ఈ గొప్ప అరబ్ విద్యావంతుని లేఖ

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ
(అపార దయామయుడు, పరమ కారుణ్యమూర్తి అల్లాహ్ పేర)

ఉషోదయపు గాలి మీ అద్భుత ప్రతిభను పొగుడ్తుంది. మీ ఉనికి మధురమైన పుష్పముల సువాసనను వెదజల్లుతుంది. మీ గొప్పతనం ప్రజల దృష్టికి ఇంకా రాలేదు. మీరు ఈ కాలపు దుష్టత్వముల నుండి రక్షించబడ్డారు. పవిత్రమైన కర్మలకు పాల్పడువారు మీ ద్వారా గొప్ప గొప్ప జ్ఞానములు నేర్చుకోవచ్చును. మీరు సూక్ష్మాతి సూక్ష్మమైన విషయములను బోధిస్తున్నారు. మీ గొప్పతనాన్ని ప్రజలు అర్థము చేసుకొని సాక్ష్యమివ్వవలెను. మీ అద్భుత జ్ఞానములను చూచిన తర్వాత మిమ్ములను ప్రశంసించడానికి, మీ కోసం ప్రార్థించడానికి, మీతో భేటి అగుటకు నా మనసులో ఉత్పన్నమైన కోరికను తెలుపుటకు నాకు పదాలు రావడం లేదు.

అల్లాహ్ తఆలా మిమ్ములను కరుణించి, శాంతి ఆశీస్సులు అందించుగాక!

స్వచ్ఛమైన హృదయముతో మనస్ఫూర్తిగా వ్రాసిన ఒక వ్యక్తి అభిమానానికి ఈ లేఖ ఒక నిదర్శనం. ఒకప్పుడు నా హృదయములో మంటలు చెలరేగాయి. అవి ప్రయాణం చేయుటకు, సాహసించు అభిరుచిని కల్పించి నన్ను ప్రోత్సహించెను. కావున నేను నా స్వదేశాన్ని విడిచి పెట్టాను. విధి నన్ను ఇక్కడికి తీసుకొచ్చినది. తద్వారా నా ప్రియ మిత్రుడు గౌ॥ హాఫిజ్ మౌల్వీ

ముహమ్మద్ యాఖూబ్ గారిని నేను కలవాలని దేవుని సంకల్పం నిర్ణయించెను. అపవిత్రమైన విషయములన్నిటి నుండి, డెహ్రాడూన్ పట్టనములో ప్రబలిన అసంఖ్యాక దుర్గుణాల నుండి అల్లాహ్ తఆలా వారిని రక్షిస్తున్నాడు. మేమిద్దరం ప్రస్తుత సంఘటనల గురించి మాట్లాడుకున్నాము. తద్వారా మాజీ సంఘటనలు, విషయములలో మునిగిపోయాము. అప్పుడు మీ గురించి తెలిసినది. నేను మీ గురించి సుదీర్ఘంగా ఆలోచించాను. నా మిత్రుడు మీ అసాధారణ ప్రతిభ, గౌరవ మర్యాదల గురించి చెప్పాడు. మీ సద్గుణముల గురించి విన్న తర్వాత నాకు మీ వైపు ఆకర్షణ ఏర్పడినది. కనుక స్వయంగా తమరిని దర్శించుకోవాలని నేను ఆశిస్తున్నాను. ప్రసంగిస్తున్న వ్యక్తి మాటల ద్వారా అతని ప్రతిభ ప్రతిబింబించును. ఒకరిని ప్రత్యక్షంగా కలిసినచో నేరుగా ప్రయోజనాలు లభించును. కాని ఈ వేసవి కాలములో ప్రయాణ కఠినత, ఇబ్బందుల వలన వేసవి తీవ్రత వలన నేను మీ దర్శనానికి రాలేక పోతున్నానని చింతిస్తు మనవి చేసుకుంటున్నాను.

**నేను గగనతలంలో ఎగర గలిగినచో ఎంత బాగుండునో**
**తద్వారా నా ఉనికి మొత్తం ఎగిరి మీ వద్దకు చేరుకునేది**
**విచారము! నా రెక్కలు విరిగి పోయినవి**
**రెక్కలు లేనిదే ఒక పక్షి ఎగరలేదనే విషయము విధితమే**

నిస్సందేహంగా నేను స్వయంగా మీ వద్దకు చేరుకోలేకున్నను నేను మీకు ఉత్తరము వ్రాయవచ్చును. ఎందుకనగా లేఖ అర్థ సమావేశమనే సామెత వుంది. ఒక విషయము గురించి తెలుసుకోవాలనగా కేవలం తెలుసుకోవడం సరిపోదు. స్వీయ అనుభవం మాత్రమే నమ్మకమునకు, విశ్వాసానికి కారణమగును. కావున ఒకరికి సాధ్యమైన ప్రయత్నము తప్పక చేయవలెను.

# ప్రేమపూర్వక ఈ ఉత్తరమునకు నా సమాధానము

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ

అస్సలాము అలైకుమ్ వరహ్మతుల్లాహి వబరకాతుహు.

అనగా మీకు శాంతి, ఆశీస్సులు, దైవ కరుణ, శుభములు లభించుగాక! ఓ నా ప్రియమైన, నిజమైన మిత్రుడా! ఎంతో ప్రేమానురాగాలతో వ్రాసిన నీ ఉత్తరం నాకు అందినది. నేను దానిని తెరిచి చూచి, చదివిన తర్వాత అందులో వ్రాసి వున్న అభిమానమును ఇట్లు అర్థము చేసుకున్నాను. ఈ ఉత్తరము ఒక నిజమైన, వినమ్రులైన, జ్ఞాని, ఉత్తముడు, మంచి చెడును గ్రహించే వ్యక్తి, ప్రతిభావంతుడు, పవిత్రుడు, మంచి అభిప్రాయము తెలుపు బుద్ధిమంతుడు, దూరదృష్టి గల వ్యక్తి వ్రాసినది. మీరు అవిశ్వాసమును ఎదుర్కొన్న, చిన్నా పెద్దల ద్వారా నిరాదరణకు గురైన వారని నాకు తెలిసినది.

మీరిచ్చిన ప్రోద్బలమునకు, అరబ్బు ప్రజలలో ఒకరిగా నిలిచి మీరు ఆప్యాయతను నాతో పంచుకున్నందుకు నేను అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలిపినాను. ఎందుకనగా అతని ద్వారా సత్యవంతుల సుగంధపు శుభవార్త అల్లాహ్ తఆలా నాకు అందించెను. అరబ్బు, సిరియా మొదలగు దేశములలోని ప్రజల సహాయ, సహకారము పొందు ఉద్దేశముతో ఆయా దేశములకు పంపుటకు నేను ఒక పుస్తకము రచించాను. ఇదే రోజులలో మీ

నుండి ఒక ఉత్తరము పొందినందున దానిని అరబ్బుల నుండి పొందిన మొదటి ఫలముగా భావించాను. దానిని తూర్పు, పశ్చిమ ప్రజల సంస్కరణ కొరకు ఒక శుభ సూచికగా భావించాను. మిమ్ములను సందర్శించుకొనుటకు మీ ప్రాంతమును సందర్శించు భాగ్యము అల్లాహ్ తఆలా నాకు కల్పించవలెననే కోరిక నాకు కలిగినది.

ఓ నా సోదరుడా! ఈ ప్రాంత ముస్లిం పండితులు నన్ను తిరస్కరించారు, నిరాకరించారు, వివిధ ఆరోపణలతో నాపై దాడి చేశారు. నన్ను శపిస్తు, దూషిస్తు నాపై మండిపడ్డారు. నేను ఈ ముస్లిం విద్వాంసులు, వారి విద్యతో విసిగిపోయాను. వారి ఇస్లాం గురించి సందేహించే వ్యక్తులలో నేను చేరిపోయాను. ఆరాధనకు అర్హుడైన ఏకైక అల్లాహ్ సాక్ష్యముగా అనుమానము, అపోహలలో వారి హృదయములను యూదుల హృదయముల వలె పొందాను. నన్ను తిరస్కరించుటలో వారు మొండిపట్టుబట్టారు, నాకు నష్టము కలిగించుటకు తీవ్ర ప్రయత్నము చేశారు. ఏకైక అల్లాహ్ విశ్వాసుణ్ణి వారు రచనలలో, ఉపన్యాసములలో అబద్ధీకరించారు. ఇలా తిరస్కరించినందుకు వారు ఏ మాత్రం పశ్చత్తాపము వ్యక్త పరచలేదు. ఇది ధర్మమును పునరుద్ధరించుటకు, షైతాన్‌లను చీదరించుటకు ఒక సంస్కర్త అవతరించే సమయమని వారు భావించలేదు. అంధకారము అలుముకున్నట్లు, దుర్మార్గము రాజ్యమేలుతున్నట్లు, శత్రువులు ఇస్లాం కోటను ఆక్రమించుకొని, దాడి చేస్తున్నట్లు, మార్గదర్శనము బదులు దుష్టత్వము ప్రబలినట్లు, శిలువను పూజించే మతము ప్రపంచములో అధిపత్యము కొనసాగిస్తున్నట్లు, నిస్సహాయ మనిషిని దేవునిగా నమ్ముతున్నట్లు, దగ్గర దూరమున్న వారిని మార్గభ్రష్టులుగా చేసున్నట్లు చూడడం

లేదా? వారి హస్తములో కేవలం అబద్ధము, మోసము, అధిక ధన సంపద వున్నది. అందుకే విద్యావంతులు, మూర్ఖులు అందరు వారి పట్ల ఆకర్షితులగుతున్నారు. తండోపతండాలుగా వారి వలలో చిక్కుకుంటున్నారు. ఈ వినాశములో అధిక ముస్లిములు చిక్కుకొనే అవకాశమున్నది. తద్వారా ఈ కుట్రలకు బలైపోయి వారు నష్టపోయే ప్రమాదమున్నది.

కనుక ఈ ధర్మ దయనీయ స్థితిని చూచిన తర్వాత అల్లాహ్ తఆలా దీనిని బలహీనంగా పొందెను. కావున తన దాసులలోని ఒక దాసున్ని ఒక సంస్కర్త రూపంలో ఈ ధర్మమునకు పునర్జీవితము ప్రసాదించుటకు పంపెను. ఓ నా సోదరుడా! ఈ రోజులు అంధకార రాత్రిని పోలి వున్నవి. సన్మార్గ గుర్తులు లేకుండా పోయినవి. అందుకే అల్లాహ్ తఆలా ఈ కాలములోని పాపములు, ప్రస్తుత పీడనములు, అశాంతిని, అంధకారమును చూచి, ప్రజలు అగ్ని గుండమునకు అంచున నిలిచి వున్నట్లు పొందెను. అందుకే వారి కొరకు ఒక దీపమును ప్రసాదించెను. అది వారిని క్రింద పడకుండా నిలువరిస్తుంది, వారి కొరకు దారిని, సంకేతములను ప్రకాశవంతం చేస్తుంది. ఇస్లాం నిస్సహాయ స్థితిని చూచి మీ హృదయములో జాలి కలుగునని భావిస్తు ఆయా దుఃఖములలోని కొన్ని దుఃఖములను నేను మీ ముందు ప్రస్తావించాను. నేను మిమ్ములను పుణ్యులు, సత్య స్వభావికులైన మిత్రులని భావిస్తున్నాను. మీరు మీ ప్రేమపూర్వక వాఖ్యములతో నన్ను సంతోషపెట్టినారు. ఈ నిస్సహాయ, జాతిచే పీడించబడిన కాలములో తమ ప్రేమపూర్వక మాటలతో, ఉత్తరములో నాకు కొంచెం మనోధైర్యాన్ని కల్పించారు.

అల్లాహ్ తఆలా మీకు దీని ప్రతిఫలము నొసంగుగాక!

మిమ్ములను కరుణించుగాక! ఎందుకనగా అతడే అందరి కంటే గొప్ప కరుణామయుడు. ఆమీన్.

ఇట్లు

ప్రజలచే బాధకు గురైన బలహీన వ్యక్తి

గులాం అహ్మద్

# ఒక అరబ్ విద్యావంతుని ఉత్తరము

సకల లోకాల సంరక్షకునికే సకల సంకీర్తనములు. ప్రజలలో ఉత్తములైన మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంపై దురూద్, శాంతి పంపుతున్నాను.

గౌరవనీయులైన మా గురువులు, మార్గదర్శకులు, నాయకులు, మా కాలపు మసీహ్ గులాం అహ్మద్ గారిని అల్లాహ్ తఆలా రక్షించుగాక! ఆమీన్. అల్లాహ్ మా ప్రార్థనను ఆమోదించుగాక! అనంతరం మీకు అల్లాహ్ తఆలా శాంతి, ఆశీస్సులు, కలుగుగాక! అతని శుభములు, అనుగ్రహములు అందుగాక! మధురమైన మీ పుస్తకము మాకు అందినది. దానిని మేము చదివినాము, అందులోని అంశములను అర్థము చేసుకున్నాము. మీరు క్షేమంగా వున్నారనే విషయము తెలుసుకొని అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాము. ఓ నా నాయకుడా! నేను చేసిన తప్పులకు అల్లాహ్ తఆలాతో, మీతో క్షమాపణ కొరుతున్నాను. ఓ నా నాయకుడా! నేను మీ కుమారుణ్ణి, మీ సేవకుణ్ణి, అల్లాహ్ తఆలా, మీకు విధేయుడను. నేను పశ్చత్తాపమునకు గురైనాను. ఇన్‌షాఅల్లాహ్! ఇక ముందు భవిష్యత్తులో ఎన్నడు తప్పులకు పాల్పడనని నేను దృఢ సంకల్పము చేశాను. గత మాదిరగా భవిష్యత్తులో ఎన్నడు మాట్లాడను. అల్లాహ్ తఆలా మీకు ఆయురారోగ్యములు ప్రసాదిస్తు, మీ ప్రయత్నములను సాఫల్యము చేయుగాక!

ఇట్లు
మీ విధేయుడు
అహ్మద్ బిన్ ముహమ్మద్ మక్కీ

మీరు తమ ఉత్తరములో వ్రాసిన విషయములతో నాకు అత్యంత ప్రసన్నత కలిగినది. మీతో భేటి అగు అవకాశము కల్పించినందుకు నేను అల్లాహ్ తఆలాకు కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాను. మీరు అల్లాహ్ తఆలా అవతారులనుటలో ఎలాంటి సందేహము లేదు. మేము విశ్వసించాము, ధృవీకరించాము. చివరికి మేము సకల లోకాల సంరక్షకునికే కృతజ్ఞతలు తెలుపు కుంటున్నాము.

## ఉత్తరము సారాంశము
## అరబ్ విద్యాంసులైన సయ్యద్ అలీ
## వల్దు షరీఫ్ ముస్తఫా అరబ్

సయ్యద్ గారు తమ సుదీర్ఘ ఉత్తరములో చాలా పెద్ద పద్యమును మరొక సుదీర్ఘ గద్య భాగమును ప్రశంసలతో వ్రాసినారు. అందులోని సుదీర్ఘ పంక్తులలోని ఒకటి ఇట్లు గలదు.

గొప్ప దూరదృష్టి, అద్భుత వివేకముతో కూడిన తూర్పులో ప్రకాశిస్తున్న నక్షత్రము, ధృఢ సంకల్పి, దివ్యవాణితో సత్కరించబడిన, అల్లాహ్ తఆలా పంపిన సంస్కర్త, ముస్లిం సామ్రాజ్య చక్రవర్తి హజ్రత్ మిర్జా గులాం అహ్మద్ గారు. మూర్ఖులు, వివేకుల కొరకు తమరి విశిష్టతలు నలువైపుల నక్షత్రముల వలె ప్రకాశిస్తున్నవి. తమరు తీరము లేని గొప్ప విద్యా సముద్రము. జ్ఞానములు, దానములకు స్వచ్ఛమైన చెలిమ.

ఈ గొప్ప అరబ్ విద్వాంసుని పద్యము, పూర్తి ఉత్తరము మరో సందర్భమున ముద్రించబడును. సాక్ష్యము కొరకు ప్రస్తుతం ఇది సరిపోతుందని ఆశిస్తున్నాను.

## డాక్టర్ మార్టిన్ క్లార్క్ గారితో పాటు ఇతర క్రైస్తవుల ప్రతినిధి మిస్టర్ అబ్దుల్లాహ్ ఆథమ్ గారు ఓటమికి గురైనచో ఇస్లాం స్వీకరిస్తామని చేసిన వాగ్దానము

ఇక్కడ క్రింద మేము మిస్టర్ అబ్దుల్లాహ్ ఆథమ్ గారు విశ్రాంత అదనపు అసిస్టెంట్ అమృత్సర్ నాయకుల వాగ్దానమును పొందుపరుస్తున్నాము. అందులో వారు డాక్టర్ మార్టిన్ క్లార్క్ గారి తో పాటు ఇతర క్రైస్తవుల ప్రతినిధిగా జండియాలా ముస్లిముల చేతిలో ఓటిమికి గురైనచో ఇస్లాం స్వీకరిస్తామని వాగ్దానము చేశారు. నిదర్శనముల రూపంలో లేదా ఏదేని సంకేతము చూసిన తర్వాత ఓటమికి గురైనచో మేము ఇస్లాం ధర్మమును స్వీకరిస్తామని అందులో వారు స్పష్టంగా తమ అంగీకారమును పొదుపరచినారు. అది ఇట్లు గలదు.

## మిస్టర్ అబ్దుల్లాహ్ ఆథమ్ గారి ఉత్తర నకలు 9 మే 1893, అమృత్సర్ నుండి

గౌ॥ మిర్జా గులాం అహ్మద్ ఖాదియాన్! ఇస్లాం ప్రతినిధి అయిన తమరి ఉత్తరమునకు సమాధానముగా ఇట్లు వేడుకుంటున్నాను. మీరు లేదా మరెవరైనా ఏదేని రూపంలో అనగా ఏదేని మహిమ లేదా గట్టి నిదర్శనము లేదా పవిత్ర ఖుర్ఆన్ బోధనల ద్వారా పవిత్ర దేవుని గుణములను నిరూపించినచో నేను ఇస్లాం స్వీకరిస్తానని ఒప్పుకొంటున్నాను. నేని సమర్పిస్తున్న ఈ రసీదును మీ చేతిలో పెట్టుకోండి. పత్రికలలో ప్రకటన మాత్రం

నేను ఇవ్వలేను.

సంతకము
మిస్టర్ అబ్దుల్లాహ్ ఆథమ్ గారు

## అబ్దుల్ హఖ్ ఘజ్నవీ ప్రకటనకు సమాధానంగా ముబిహిలహ్ ప్రకటన దివి: 26 షవ్వాల్ 1310 హిజ్రి

అబ్దుల్ హఖ్ ఘజ్నవీ దివి: 26 షవ్వాల్ 1310 హిజ్రి తేదీన ముద్రించిన ఒక ప్రకటన నేను చదివినాను. కావున ఈ కరపత్రము ముద్రించబడుతుంది. నన్ను నిరాకరించే ప్రతి మౌల్వీ లేదా విద్యావంతునితో నేను ముబాహిలహ్‌కు సిద్ధముగా వున్నాను. హిజ్రి 1310 జిఖాద 3 లేదా 4వ తేదీ వరకు నేను అమృత్సర్ చేరుకోగలని ఆశిస్తున్నాను. ఇన్షాఅల్లాహ్. ముబాహిలహ్ తేదీ 10 జీఖాద లేదా వర్షము లేదా మరో అనివార్య కారణము వలన జీఖాద 11వ తేదీ నిర్ణయించబడెను. ఈ తేదీలను దాటే ఆస్కారము లేనే లేదు. ముబాహిలహ్ ప్రదేశముగా మస్జిద్ ఖాన్ బహాదుర్ సమీపములో గల ఈద్‌గాహ్ నిర్ణయించబడెను. ఉదయం పూట అనగా సుమారు మధ్యాహ్నం 12 గంటల వరకు ఇస్లాం వాస్తవము గురించి క్రైస్తవులతో జరిగే చర్చలో నేను పాల్గొంటాను. ఈ చర్చ వరుసగా 12 రోజుల వరకు కొనసాగును. కావున నన్ను కాఫిర్ (అవిశ్వాసి) అని ప్రకటించే అవిశ్వాసులు నాతో ముబాహిలహ్ చేయదలచుకున్నచో మధ్యాహ్నము 2 గం॥ల నుండి సాయంత్రము వరకు నన్ను సంప్రదించవచ్చును. అప్పుడు నాకు తీరిక వుండును.

అప్పుడు జీఖాద 10వ తేదీన లేదా మరేదైనా పని పడినచో హిజ్రి 1310 జీఖాద 11వ తేదీన నాతో ముబాహిలహ్ చేసుకోగలరు. మేము జీఖాద తేదీ నిర్ణయించుటలో గల కారణమేమనగా కలిమా చదువుతున్న, ఖిబ్లాను విశ్వసిస్తున్న నన్ను అవిశ్వాసిగా ప్రకటించి నాతో ముబాహిలహ్ చేయదలచిన వారందరు ముబాహిలహ్ చేయవచ్చును. ముహియుద్దీన్ లఖూవాలె, మౌల్వీ అబ్దుల్ జబ్బార్ గారు, షేఖ్ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ, మున్షీ సాదుల్లాహ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, అబ్దుల్ అజీజ్ లుధ్యానా ఉపన్యాసకుడు, మున్షీ ముహమ్మద్ ఉమర్ మాజీ ఉద్యోగి లుధ్యానా నివాసి, మౌల్వీ ముహమ్మద్ హసన్ లుధ్యానా నాయకులు, మియాఁ నజీర్ హుసేన్ గారు ఢిల్లీ, పీర్ హైదర్ షాహ్ గారు, హాఫిజ్ అబ్దుల్ మన్నాన్ వజీరాబాదీ, మియాఁ అబ్దుల్లాహ్ టోంకీ, మౌల్వీ గులాం దస్తగీర్ ఖుసూరీ, మౌల్వీ షాహ్‌దీన్ గారు, మౌల్వీ ముష్తాఖ్ అహ్మద్ గారు లుధ్యానా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, మౌల్వీ రషీద్ అహ్మద్ గంగోహి, మౌల్వీ ముహమ్మద్ అలీ ఉపన్యాసకులు బూప్‌రాన్ జిల్లా గుజ్రాన్‌వాలా నివాసులు, మౌల్వీ ముహమ్మద్ ఇస్‌హాఖ్, సులెమాన్, వీరిద్దరు పట్యాలా నివాసులు. జుహూరుల్ హసన్ బటాలా పీఠాధిపతి, మౌల్వీ ముహమ్మద్ ములాజిమ్ ముద్రణాలయము కరమ్ బఖ్ష్ లాహెూర్ మొదలగు వారందరు మా ద్వారా రిజిస్టరి చేయబడిన కరపత్రములు అందినను ముబాహిలహ్ కొరకు నిర్ణీత ప్రదేశమునకు చేరుకోలేక పోయినచో నన్ను అవిశ్వాసి అని ప్రకటించుటలో తమను తాము అసత్యులుగా, క్రూరులుగా భావిస్తున్నారనడానికి ఒక గట్టి నిదర్శనము అగును. అందరికంటే ముందుగా ఇషాఅతుస్సున్నహ్ పత్రిక సంపాదకులు ముహమ్మద్ హుసేన్ బటాల్వీ నిర్ణీత తేదీలో అమృత్సర్ చేరవలసిన

అవసరమున్నది. ఎందుకనగా అతడు స్వయంగా ముబాహిలహ్ కొరకు మనవి పంపియున్నాడు. మేము పదే పదే ముబాహిలహ్ చేయుటను ఇష్టపడడం లేదు. ఎందుకనగా ముబిహిలహ్ ఏదో ఆషామాషీ విషయము కాదు. ఇప్పుడు నన్ను అవిశ్వాసి అని ప్రకటించిన వారందరి గురించి తీర్పు వెలువడవలెను. మా కరపత్రము ప్రచురించబడిన తర్వాత విముఖత చూపిన లేదా నిర్ణీత తేదీలో హాజరు కాని వారు భవిష్యత్తులో ముబాహిలహ్‌కు మనవి చేయు అర్హత కోల్పోవుదురు. మేము లేని చోట మమ్ములను అవిశ్వాసి అని ప్రకటించుట సిగ్గులేనితనమగును. మా తరపున ఎలాంటి లోపము లేకుండా రిజిస్టిరి చేసి కరపత్రములను పంపుతున్నాము. అనంతరం నన్ను తిరస్కరించిన వారికి ఎటువంటి సాకు లభించదు. దీని తర్వాత ముబాహిలహ్ చేయకుండా అవిశ్వాసి ప్రకటించడంను వీడని యెడల మేము బాధ్యులము కాదు. ముబాహిలహ్ కంటే ముందు సభలో తిరస్కృతుల సమక్షములో తాము ముస్లిం అని ప్రకటించుకునే కారణాలను వెల్లడించు హక్కు మాకుండునని గుర్తుంచుకోవలెను. మార్గదర్శనము పొందిన వారికి సలాం.

ఇట్లు
ప్రకటన కర్త
మిర్జా గులాం అహ్మద్
1310 షవ్వాల్ 30

## సారాంశము

ఒక వేళ షేఖ్ ముహమ్మద్ హుసేన్ బటాల్వీ హిజ్రి 1310 జీఖాద 10వ తేదీన ముబాహిలహ్ కొరకు హాజరు కాని పక్షములో నన్ను అవిశ్వాసి అని ప్రకటించుటలో పశ్చత్తాపపడునని అతని గురించి ప్రకటించబడిన భవిష్యవాణి పూర్తి అయినట్లు భావించ బడును. చివర్లో నేనిట్లు దుఆ చేస్తున్నాను. ఓ సర్వశక్తిమంతుడైన అల్లాహ్! ఇతడు ఈ ముబాహిలహ్ ఆహ్వానము కొరకు నిర్ణీత నగరము, ప్రాంతము, సమయము ప్రకటించిన తర్వాత కూడ నాకు పోటీగా ముబాహిలహ్ కొరకు రాకుండా నన్ను అవిశ్వాసుడని ప్రకటించుటలో, దూషించుటలో వెనుకడుగు వేయని ఈ క్రూరుని, దుష్టుని, మోసకారిపై శాపము వేయుము. అతణ్ణి అవమానమునకు గురి చేయుము. ఆమీన్ సుమ్మ ఆమీన్. (✡)

నన్ను అవిశ్వాసి అని ప్రకటిస్తున్న ఓ తిరస్కృతులారా! తిరస్కృతులు, అసత్యవాదుల నోరు మూయించు అల్లాహ్, అతని ప్రవక్త సూత్రమును పాటించుటకు ముందుకు రండి. మీరు వెనుకడుగు వేసినచో అసత్యవాదులపై దైవ శాపము పడునని గుర్తుంచుకోగలరు. ఎందుకనగా వారు వెనుకడుగు వేయుట, వారి భయము వారు అసత్యవాదులని నిరూపించెను.

ప్రకటనకర్త
మిర్జా గులాం అహ్మద్
ఖాదియాన్

---

*(✡) నన్ను అవిశ్వాసి అని ప్రకటించిన (ఉలమాలు) విద్యావంతు లందరిని నిర్ణీత తేదీ అనగా హిజ్రి 1310 జీఖాద 10వ తేదీన అమృత్సర్‌నకు ముబాహిలహ్ కొరకు రాగలరని ఆహ్వానిస్తున్నాము.*